సాక్షి కర్నూలు

మంగళవారం । 1 । ఆగస్టు । 2023




శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులకు సోమవారం సహస్రదీపార్చన చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ జరిపారు.



అవ్వ అవతారమెత్తి..

హాలహర్వి మండలం మెదేహాల్ గ్రామంలో ఓ మహిళ పూజల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తోందని గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. 8లో



తగ్గుతున్న వరద ప్రవాహం

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణా, తుంగభద్ర నదుల్లో వరద ప్రవాహం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో 79, తుంగభద్ర డ్యాంలో80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి వైఎస్ఆర్ పెన్షన్ కానుక

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద 16 రకాల పింఛన్లు పంపిణీ అవుతున్నాయి. ఆగస్టు నెలకు సంబంధించి వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.124.61 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను సంబంధిత బ్యాంకుల నుంచి సోమవారం వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు డ్రా చేశారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచే గ్రామ, పట్టణ ప్రాంతాల్లోని గ్రామ, వార్డు వలంటీర్లు ఈనెల 5వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 2,36,082 పింఛన్‌లు, నంద్యాల జిల్లాలో 2,13,640 పింఛన్ల పంపిణీకి డీఆర్‌డీఏ–వైకేపీ ఏర్పాట్లు చేసింది.

ఐఏబీ సమావేశం 8వ తేదీకి వాయిదా

కర్నూలు సిటీ: సాగు నీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశాన్ని ఈ నెల 8వ తేదీకి వాయిదా వేశారు. సమావేశాన్ని మంగళవారం కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించాలని నిర్ణయించారు. కొన్ని అనివార్య కారణాలతో ఈ నెల 8న నంద్యాలలో నిర్వహించాలని జలవనరుల శాఖ ఇంజినీర్లు నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని సాగునీటి కాలువలకు ఖరీఫ్ పంటల సాగుకు నీటి విడుదలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

పోలీస్ స్పందనకు 75 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 75 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్పందనకు వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో ఎస్పీ కృష్ణకాంత్ నేరుగా మాట్లాడారు. చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.19 కోట్లతో ఎఫ్ఎన్ఎస్ ప్రదర్శన క్షేత్రాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఫుడ్ అండ్ న్యూట్రీషన్ సెక్యూరిటీ కింద రూ.2.19 కోట్లతో 2023–24లో వివిధ పంటల సాగుకు సంబంధించి వ్యవసాయ క్లస్టర్ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ పేరుతో అమలైన ఈ పథకాన్ని ఈ ఏడాది నుంచి ఫుడ్ అండ్ న్యూట్రీషన్ సెక్యూరిటీ(ఎఫ్ఎన్ఎస్) పేరుతో అమలు చేస్తున్నారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ మిల్లెట్ ఇయర్‌గా ప్రకటించిన నేపథ్యంలో వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటులో మిల్లెట్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక క్లస్టర్‌లో 20 హెక్టార్లు ఉంటుంది. పత్తికి మాత్రం 10 హెక్టార్లను ఒక ప్రదర్శన క్షేత్రంగా అభివృద్ధి చేస్తారని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఎఫ్ఎన్ఎస్ కింద క్లస్టర్ ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.2.19 కోట్లు ఖర్చు చేస్తున్నాయని సోమవారం ఆమె విలేకరులకు వెల్లడించారు.

వందే భారత్ రైలు ట్రయల్ రన్



డోన్ స్టేషన్‌కు చేరుకున్న వందే భారత్ రైలు

డోన్ టౌన్: ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన వందే భారత్ రైలు ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి రాబోతుంది. ఆగస్టు 6వ తేదీ నుంచి డోన్ మీదుగా కాచిగూడ – యశ్వంత్‌పూర్ మార్గంలో వందే భారత్ రైలు నడిచేలా రైల్వే అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ మేరకు సోమవారం డోన్ – కాచిగూడ స్టేషన్ల మధ్య ట్రయల్ రన్ నిర్వహించారు. చెన్నై నుంచి ఉదయం 6.30 గంటలకు డోన్ జంక్షన్‌కు చేరుకున్న వందే భారత్ రైలు 7.10 గంటలకు కాచిగూడ వైపు బయలుదేరి వెళ్లింది. వందే భారత్ రైలు డోన్‌కు చేరుకోవడంతో అధికారులతో పాటు ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. కొందరు సెల్ఫీలు తీసుకున్నారు. వందే భారత్ రైలు అందుబాటులోకి రావడంతో కర్నూలు, నంద్యాల జిల్లా ప్రజలకు బెంగళూరు – హైదరాబాద్‌కు మధ్య ప్రయాణం సమయం తగ్గనుంది.

సాగునీరు.. వ్యవసాయం.. రైతుల సంక్షేమం.. తన తొమ్మిదేళ్ల పాలనలో ఏనాడు ఆలోచించని చంద్రబాబు నేడు ప్రాజెక్టుల సందర్శన పేరిట హడావుడికి సిద్ధపడటం చూసి శంకుస్థాపనలు వెక్కిరిస్తుంటే.. ఇప్పుడిప్పుడే జీవం పోసుకుంటున్న ప్రాజెక్టులు నవ్వుకుంటున్నాయి. అంచనాలు పెంచి రీ టెండర్లు పిలవడం ద్వారా డబ్బు దండుకోవడం తప్పిస్తే నీరివ్వలేని 'పచ్చ'నేత రాకతో సీమ కన్నీరు పెడుతోంది. అధికారంలో ఉండగా ప్రాజెక్టులను ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకెళ్లలేకపోయినా.. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీల విషయంలో జీఓ విడుదల చేసి రైతుల పొట్టకొట్టిన తీరు ఇప్పటికీ కళ్ల ముందు మెదలుతోంది. నీటి పారుదల రంగాన్ని విస్మరించడంతో పాటు వ్యవసాయమే దండగని చెప్పిన 'ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ' నేత ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని నీరు పారుతున్న ప్రాజెక్టులను చూసేందుకు వస్తున్నారని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు




శంకుస్థాపనలు వెక్కిరిస్తూ.. ప్రాజెక్టులు నవ్వుకుంటూ!

చంద్రబాబు రాకతో కన్నీరు

- హంద్రీ–నీవాతో పాటు రాయలసీమ ప్రాజెక్టులను విస్మరించిన వైనం
- వ్యవసాయం, రైతుల సంక్షేమం గాలికొదిలి పాలన
- మూడుసార్లు ముఖ్యమంత్రిగా శంకుస్థాపనలకే పరిమితం
- రాయలసీమ రైతుల కోసం అనుక్షణం తపించిన మహానేత వైఎస్సార్
- ప్రాజెక్టులకు జీవం పోస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాయలసీమలోని నాలుగు జిల్లాలకు సాగునీరు అందించేందుకు హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి దివంగత ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారు. దీన్ని పూర్తిగా విస్మరించిన చంద్రబాబు ఆ తర్వాత 9 ఏళ్లలో రెండుసార్లు శంకుస్థాపన చేయడం మినహా ప్రాజెక్టును అడుగు కూడా తవ్వలేకపోయారు. ఆ తరువాత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక 6.02లక్షల ఎకరాలకు సాగునీరు, 30లక్షల మందికి తాగునీరు అందించేందుకు 2004జూలై 24న శంకుస్థాపన చేశారు. రూ.6,850 కోట్లతో టెండర్లు పిలిచి, ఆ ఐదేళ్లలో రూ.4,340.36 కోట్లను ఖర్చు చేశారు. అనంతరం రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో రూ.2,143కోట్లు ఖర్చు చేసి ఎట్టకేలకు 2012లో మల్యాల నుంచి నీటిని ఎత్తిపోసి అనంతపురం వరకూ తరలించారు. ఆ నీటితో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు వైఎస్ విగ్రహానికి జలాభిషేకం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు 2014లో సీఎం అయ్యారు. ఫేజ్–2లో బ్యాలెన్స్ పనులు ఏకంగా 300శాతం అంచనాలు పెంచి రీ టెండర్లు పిలిచి డబ్బులు దండుకోవడం మినహా రైతులకు నీరివ్వాలనే శ్రద్ధ చూపలేకపోయారు. హంద్రీనీవా ఫేజ్–1 పూర్తయినా డిస్ట్రిబ్యూటరీలు చేయకుండా జీవో జారీ చేసి రాయలసీమ రైతుల పొట్టకొట్టారు. ఇదిలాఉంటే.. నేడు చంద్రబాబు సందర్శించనున్న ముచ్చుమర్రి ప్రాజెక్టుకు నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో డిజైన్ చేసి, డీపీఆర్ సిద్ధం చేశారు. ఆయన హయాంలోనే శంకుస్థాపన చేసినా అకాల మరణం నేపథ్యంలో ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు ఆ పనులను కొనసాగించారు. అయితే చంద్రబాబు తన హయాంలో కేవలం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి అది తన ఘనతగా చెప్పుకోవడం గమనార్హం.

☛ హంద్రీ–నీవా సుజల స్రవంతికి 1996 మార్చి 11న అనంతపురం జిల్లా ఉరవకొండలో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దాని ఊసే లేదు. 1999 జూలై 9న అదే జిల్లా ఆత్మకూరులో మరో శంకుస్థాపన చేపట్టారు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ గెలిచి ముఖ్యమంత్రిగా చంద్రబాబు రెండోసారి బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఈ పథకాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు. తన 9 ఏళ్ల పాలనలో ఈ పథకానికి కేవలం రూ.190కోట్లను కేటాయించి, అందులో రూ.24.53కోట్లను మాత్రమే ఖర్చు చేశారు.



☛ ఈ ఫోటో చూశారా! కర్నూలు జిల్లా మల్యాల వద్ద హంద్రీ–నీవా ఎత్తిపోతల పథకం. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తవ్విన కాలువ ఇది. వైఎస్సార్ సీఎం హోదాలో రూ.6,850 కోట్ల వ్యయంతో హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకానికి టెండర్లు పిలిచారు. తన ఐదేళ్ల హయాంలో రూ.4,340.36 కోట్లను ఖర్చు చేశారు. పనులను పూర్తి చేసి సాగునీరు అందించి రైతుల కళ్లలో ఆనందం నింపే ప్రయత్నం చేస్తున్న సమయంలో ఆయన తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.



☛ ఇక జీవో 22 విషయానికొస్తే.. 2012లోనే హంద్రీ–నీవాకు నీళ్లొస్తే 2014లో మూడోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధాన కాలువ కుప్పం వరకు పూర్తయ్యే వరకు డిస్ట్రిబ్యూటరీలు చేయొద్దని 2015 ఫిబ్రవరి 23న జారీ చేశారు.

సీమను సస్యశ్యామలం చేసిన వైఎస్సార్

2004–09 మధ్యలో ఐదేళ్ల పాటు సీఎంగా ఉన్న వైఎస్సార్ 'సీమ'ను సస్యశ్యామలం చేసే ప్రయత్నం చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11,500 నుంచి 44వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ విస్తరణ చేయొద్దని అప్పట్లో టీడీపీ నేత దేవినేని ఉమా విజయవాడలో నిరసన దీక్ష చేపట్టారు. బానకచర్ల కాంప్లెక్స్ నుంచి గోరుకల్లు వరకు 23,500 క్యూసెక్కుల సామర్థ్యంతో ఎస్ఆర్‌బీసీ కాలువను విస్తరించారు. గాలేరు–నగరి, గోరుకల్లు ప్రాజెక్టు, అవుకు టన్నెల్, అవుకు రిజర్వాయర్, గురురాఘవేంద్ర లిఫ్టులను చేపట్టారు. రూ.279కోట్లతో ఎల్ఎల్‌సీని ఆధునీకరించారు. పులికనుమ, గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు లిఫ్టుల ఏర్పాటుతో పాటు పలు పథకాలు చేపట్టి కరువును పారదోలి 'సీమ'లో బంగారు పంటలు పండించేందుకు శ్రమించారు.



తండ్రి అడుగు జాడల్లో రెండడుగులు ముందుకు!

➤ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019లో బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెండేళ్లపాటు కోవిడ్ దెబ్బకు ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైంది. అయినప్పటికీ ఆయన 'సీమ' ప్రాజెక్టుల ఆవశ్యకత విస్మరించలేదు. రూ.3,307కోట్లతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. ఎన్జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) అనుమతులు రాగానే ప్రాజెక్టు ముందుకెళ్లనుంది.

➤ పోతిరెడ్డిపాడు–బనకచర్ల, బనకచర్ల–గోరుకల్లు లైనింగ్ పనులకు రూ.1166.78కోట్లు కేటాయించగా.. 90శాతం పనులు పూర్తయ్యాయి.

➤ గోరుకల్లు ఇన్‌ఫ్రా రెగ్యులేటర్‌కు రూ.287.5కోట్లు ఖర్చు చేశారు.

➤ బానకచర్ల కేసీ ఎస్కేప్ ఛానల్, కుందూ విస్తరణ, రాజోలి, జొలదరాశికి రూ.1,402 కోట్లు వెచ్చించారు.

➤ తెలుగుగంగ లైనింగ్ పనులకు టీడీపీ ఎన్నికల సమయంలో హడావుడిగా జీవో జారీ చేసినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ పనులకు రూ.280.27కోట్లు కేటాయించి పనులను పూర్తి చేస్తున్నారు.

➤ గోరుకల్లు, అవుకు రిజర్వాయర్ లైనింగ్ పనులు, అవుకు మూడో టన్నెల్‌కు రూ.1457.10కోట్లు కేటాయించారు.

➤ కర్నూలు జిల్లాలో రూ.260కోట్లతో 68 చెరువులకు నీరందించారు.

➤ గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4.5 టీఎంసీల నుంచి 5.5 టీఎంసీలకు పెంచేందుకు రూ.54కోట్లు ఖర్చు చేశారు.

➤ ఎల్ఎల్‌సీ లైనింగ్ పనులు చేపడుతున్నారు.

➤ వేదవతి, ఆర్డీఎస్‌కు టీడీపీ ప్రభుత్వం జీఓ ఇచ్చి చేయి దులుపుకోగా వేదవతికి రూ.1922.50కోట్లు, ఆర్డీఎస్‌కు రూ.1984.42కోట్లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేటాయించింది. వేదవతి హెడ్ వర్క్, కెనాల్ వర్క్ ప్రారంభయ్యాయి. భూసేకరణ విషయంలో టీడీపీ నేతలు కోర్టుకెళ్లి అడ్డుపడ్డారు. ఆర్డీఎస్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేయడంతో అడ్డంకి ఏర్పడింది.

14ఏళ్లు ఏం చేశావు బాబూ



టీడీపీ అధినేత చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన చేపట్టడం విడ్డూరం. 14 ఏళ్లు సీఎంగా పనిచేసినా కర్నూలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి, ఆధునీకరణకు ఏం చేశారో ముందుగా ప్రజలకు చెప్పాలి. జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో కాలువల్లో నీరు పారక, పొలాలకు నీరందక వేలాది ఎకరాలు ఎండిపోయినా పట్టించుకోని వ్యక్తి సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడటం హాస్యాస్పదం.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే

సాగునీటి ప్రాజెక్టుల సందర్శన ఎన్నికల స్టంట్



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాగునీటి ప్రాజెక్టుల సందర్శన ఎన్నికల స్టంట్ మాత్రమే. ప్రాజెక్టులపై ప్రేమ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోలేదు. నేడు రైతుల్లో సానుభూతి కోసం కొత్త డ్రామాకు తెరతీశారు. రాజోళి, జోళదరాశికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులన్నా కేటాయించి కొద్దిగా పనులు చేస్తున్నారు. చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల కోసం ఖర్చు చేసింది శూన్యం.

– రమేష్‌కుమార్, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి, నంద్యాల

ఎన్నికలప్పుడే రైతులు గుర్తుకొస్తారు



ఎన్నికలు వస్తున్నాయంటేనే రాజకీయ నాయకులకు రైతులు గుర్తుకు వస్తారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే చంద్రబాబునాయుడు ప్రాజెక్టులను సందర్శిస్తున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టుల సందర్శన పేరుతో నేడు నందికొట్కూరుకు వస్తున్న చంద్రబాబుకు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ప్రాజెక్టులు కనిపించలేదో, వాటికి ఎందుకు నిధులు విడుదల చేయలేదో ప్రజలకు చెప్పాలి.

– రంగనాయుడు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, నంద్యాల

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

- స్పందన కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయొద్దు
- రీ ఓపెన్ అయిన అర్జీలకు సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, చిత్రంలో జేసీ మౌర్య తదితరులు

కర్నూలు(అర్బన్): జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే 'జగనన్నకు చెబుదాం, స్పందన' కార్యక్రమానికి ప్రజలు ఎంతో నమ్మకంతో వస్తున్నారని, స్వీకరించిన ప్రతి అర్జీకి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం, స్పందన ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్‌ఓ నాగేశ్వరరావుతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ..స్పందన కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు పని చేయాలన్నారు.కార్యక్రమానికి వచ్చే అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్ అయిన వాటికి సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇచ్చి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

వినతుల్లో కొన్ని ...

➡ తనకు 1.46 ఎకరాల భూమి ఉందని, అయితే ఆన్‌లైన్‌లో 74 సెంట్లు మాత్రమే నమోదు చేశారని, మిగులు భూమిని కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆదోని మండలం చిన్న హరివాణం గ్రామానికి చెందిన అంజనమ్మ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

➡ తనకు 3 ఎకరాల భూమి ఉందని, ఆన్‌లైన్‌లో తన పేరుకు బదులు వేరే వారి పేరును నమోదు చేశారని, తన వద్ద ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ను పరిశీలించి ఆన్‌లైన్‌లో తన పేరును నమోదు చేయించాలని ఆస్పరికి చెందిన పింజరి బీబీ కోరారు.

➡ తనకు ఉన్న 1.50 ఎకరాల భూమిని వెబ్ ల్యాండ్ అడంగల్‌లో నమోదు చేయించాలని ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన కే రాముడు వినతి పత్రం అందించారు.

➡ కోడుమూరు మండలం వర్కూరు గ్రామంలో సర్వే నెంబర్ 27లో తనకున్న 1.50 ఎకరాల భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని, తగిన న్యాయం చేయాలని గ్రామానికి చెందిన సుశీలమ్మ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

➡ నగరంలోని అంబేద్కర్ భవన్‌ను ఆధునీకరించాలని బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య, సీనియర్ న్యాయవాది వై మధుసూధన్ వినతి పత్రం అందించారు.

➡ హంద్రీ నదికి సంబంధించిన భూమిని రీ సర్వే చేయించి నదికి హద్దులను ఏర్పాటు చేయాలని రాయలసీమ యువజన పోరాట కమిటీ నాయకులు వీవీ నాయుడు తదితరులు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

10న అల్బెండజోల్ మాత్రల పంపిణీ

నులి పురుగుల నివారణకు ఈ నెల 10వ తేదీఊ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డా.జీ సృజన ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఆమె జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి ' నులిపురుగుల నివారణ, వాతావరణ మార్పు ఆరోగ్య పరిష్కారాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 1 నుంచి 2 సంవత్సరాలు ఉన్న చిన్నారులకు భోజనం అనంతరం అల్బెండజోల్ సగం మాత్ర, 3 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు భోజనం అనంతరం ఒక మాత్ర వేసుకునేలా అందించాలన్నారు. ఈ మాత్రలను సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కూడా అందించాలన్నారు. రాష్ట్ర స్వాస్థ్య కో ఆర్డినేటర్ డా.హేమలత మాట్లాడుతూ ఈ నెల 10న మాత్రలు తీసుకోని వారికి 18న మాప్ – అప్ కార్యక్రమం ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య, డీఈఓ రంగారెడ్డి, ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

జూలైలో 64 శాతం అధిక వర్షపాతం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మిమీ ఉండగా 64 శాతం అధికంగా 148.5 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మూడు మండలాలు ఆలూరులో 15, హొళగుందలో 13, ఆస్పరిలో 9 శాతం ప్రకారం లోటు వర్షపాతం ఉన్నట్లు స్పష్టమవుతోంది. జూలై 24 నాటికి జిల్లా మొత్తంగా 1,33,553 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వారం రోజులుగా వర్షాలు పడటంతో సాగు విస్తీర్ణం 1,87,391 హెక్టార్లకు పెరిగింది. సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా.. 44.45 శాతం సాగైంది. వారం రోజుల వ్యవధిలో 53,838 హెక్టార్లు సాగు పెరిగింది. ఇప్పటి వరకు పత్తి 1,11,807, వేరుశనగ 32,175, వరి 561, మొక్కజొన్న 1,929, మిరప 5,613, ఉల్లి 6,086 హెక్టార్లలో సాగైంది.

పదోన్నతులకు 2 నుంచి డిపార్టుమెంటల్ పరీక్ష

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల పదోన్నతుల కోసం 2 నుంచి 7వ తేదీ వరకు డిపార్టుమెంటల్ టెస్టు నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఏపీపీఎస్సీ ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు నేతృత్వంలో డీఆర్వో కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు సమన్వయ సమావేశం జరుగనున్నది. కాగా, జిల్లాలో డిపార్టుమెంట్ పరీక్షల కోసం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, అయాన్ డిజిటల్ సంస్థలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. జిల్లాలో అబ్జెక్టివ్ టైప్‌లో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షకు 3,399 మంది, ఆఫ్‌లైన్‌లో నిర్వహించే వ్యాసరూప పరీక్షలకు 82 మంది హాజరు కానున్నారు.

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటరంగారెడ్డి

- కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటేశ్వర్లు



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా గ్యాస్ట్రో ఎంట్రాలజి హెచ్‌ఓడి డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి(ఎఫ్ఏసీ) నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం డీఎంఈ డాక్టర్ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి సోమవారం పదవీ విరమణ చేయడంతో నూతన సూపరింటెండెంట్‌ను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వుల కాపీని సాయంత్రం డాక్టర్ వెంకటరంగారెడ్డికి కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుధాకర్ అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ బాధ్యతలను డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి అప్పగించారు. డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి స్వస్థలం వైఎస్ఆర్ జిల్లా పులివెందుల తాలూకా చక్రాయపేట. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించడమే తన లక్ష్యమన్నారు. మందులు, వైద్యపరీక్షలు, మంచి నర్సింగ్ కేర్ అందిస్తానన్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, సెక్యూరిటీపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటేశ్వర్లు



డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు

ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు నియమితులయ్యా రు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

క్లుప్తంగా

ఎయిర్‌పోర్టులో పకడ్బందీగా తనిఖీలు


ఎయిర్ పోర్టు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ విద్యాసాగర్

ఓర్వకల్లు: విమానాల రాకపోకల సమయంలో ఎయిర్‌పోర్టులో తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ ఆదేశించారు. ఏవియేషన్ సెక్యూరిటీ సాంస్కృతిక వారోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఎయిర్‌పోర్టులో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 5 వరకు జరిగే వారోత్సవాలకు ప్రయాణికులు మినహా బయటి వ్యక్తులను లోపలకు అనుమతించరాదన్నారు. కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం ఎంఈఓ సస్పెన్షన్?

కర్నూలు(సెంట్రల్): వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకాకుండా నిర్లక్ష్యం వహించిన కౌతాళం ఎంఈఓపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓను సస్పెండ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ అభివృద్ధి పనులపై మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థుల డ్రాపౌట్స్ అంశంపై సమీక్షలో కౌతాళం ఎంఈఓ శోభారాణి లేకపోవడంతో ఆమెను సస్పెండ్ చేయాలని డీఈఓ రంగారెడ్డిని ఆదేశించారు. అలాగే హౌసింగ్‌పై సమీక్ష సమయంలో చిన్నటేకూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవికుమార్ వెకిలి నవ్వులతో ఉండడాన్ని గమనించిన ఆమె అతన్ని కూడా సస్పెండ్ చేయాలని పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు.

3న బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ఉమ్మడి జిల్లాలో సమగ్ర శిక్షలో పనిచేసుకున్న ఇన్‌క్లుసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్, సీఆర్పీలు, మండల అకౌంటెంట్‌లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మెసెంజర్/ఆఫీస్ సబార్డినేట్స్‌కు ఈ నెల 3న బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని సమగ్ర శిక్ష కార్యాలయంలో జరగనున్న బదిలీల కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

అధిక దిగుబడికి సాంద్రత పద్ధతి

- పత్తి సాగులో నూతన విధానం
- స్వల్పకాలిక హైబ్రిడ్ విత్తనాల వినియోగం
- ఉమ్మడి జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా సాగు
- ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటుకు శ్రీకారం


అధిక సాంద్రత సాగు పద్ధతిలో పత్తి విత్తనాలు నాటుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): చీడపీడల బెడద లేకుండా పత్తిలో అధిక దిగుబడులు సాధించేందుకు అధిక సాంద్రత పద్ధతిని వ్యవసాయాధికారులు ప్రోత్సహిస్తున్నారు. నల్లరేగడి నేలల్లో ఏడాదికి రెండు పంటలు తీసే అవకాశం ఉన్నప్పటికీ రైతులు కేవలం ఒక్క పత్తి పంటకు మాత్రమే పరిమితమవుతున్నారు. తక్కువ ఆదాయం పొందుతూ.. పంట పూర్తయిన తర్వాత చిన్న, సన్న, మధ్యకారు రైతులు వసలబాట పడుతున్నారు. పత్తిని సంప్రదాయ పద్ధతిలో కాకుండా అధిక సాంద్రత పద్ధతి(హై డెన్సిటీ ప్లాంటేషన్ ప్రోగ్రామ్)లో సాగు చేసే విధంగా పరిశోధన సంస్థలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈ విధానంలో ఎంపిక చేసిన రైతులతో పత్తి సాగుకు శ్రీకారం చుట్టారు.

శాస్త్రవేత్తల పర్యవేక్షణ

నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం, యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో నూతన విధానంలో పత్తి సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ విధానంపై రైతులకు అవగాహన ఏర్పడే విధంగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయనున్నారు. నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో కల్లూరు మండలంలోని లక్ష్మీపురం, పొన్నాపురం, సీ.బెళగల్ మండలంలోని ఎనగండ్ల, పోలకల్, మరో రెండు గ్రామాలు, నంద్యాల జిల్లాలోని దేవనూర్, నందికొట్కూరు, పూడిచెర్ల, జలకనూరు గ్రామాల్లో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏఏ కంపెనీలు, ఏఏ వెరైటీలు ఈ పద్ధతికి వినియోగించాలనే దానిని కూడా కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థనే సూచించింది. బీటీ రకాల్లో స్వల్పకాలిక రకాలను వినియోగిస్తున్నారు.

రెట్టింపు స్థాయిలో మొక్కలు

సంప్రదాయ పద్ధతిలో సాలుకు, సాలుకు మధ్య 90 నుంచి 120 సెం.మీ, మొక్కకు, మొక్కకు మధ్య 45 నుంచి 90 సెం.మీ ఉండే విధంగా పత్తి సాగవుతోంది. ఈ విధానంలో ఎకరాకు 15 వేల నుంచి 25 వేల మొక్కలు మాత్రమే వస్తున్నాయి. హెచ్‌డీపీపీ (హై డెన్సిటీ ప్లాంటేషన్ ప్రోగ్రామ్) కింద సాలుకు, సాలుకు మధ్య దూరం 30నుంచి 90 సెం.మీ, మొక్కకు, మొక్కకు మధ్య దూరం 10 నుంచి 15 సెం.మీ మాత్రమే ఉంటుంది. దీంతో రెట్టింపు స్థాయిలో మొక్కలు వస్తాయి. మామూలు పద్ధతిలో ఎకరాకు 2 నుంచి 3 ప్యాకెట్ల బీటీ పత్తి విత్తనాలు మాత్రమే వేస్తారు. అధిక సాంద్రత పద్ధతిలో ఎకరాకు 5 నుంచి 6 ప్యాకెట్ల విత్తనాలు వేయాల్సి ఉంది. గ్రోత్ రెగ్యులేటర్స్ కింద మెపిక్వాట్ క్లోరిన్ 50-60 రోజులు, 90 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాల్సి ఉంది. దీంతో పైరు మొత్తం ఒకే ఎత్తులో పెరుగుతుంది. శాఖలు పెరుగడం వల్ల కాయలు ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. పత్తి కాయలు కూడా అన్ని ఒకేసారి పగులుతాయి. నూతన పద్ధతిలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే పత్తి తీస్తారు. పత్తితీతకు హార్వెస్టర్లను కూడా అందుబాటులోకి తెస్తున్నారు. వినూత్న పద్ధతిలో ఎకరాకు రూ.6000 వరకు పెట్టుబడి ఖర్చు ఎక్కువగా ఉంటుంది. మొక్కల సంఖ్య పెరుగుతుండటంతో ఎకరాకు 4 క్వింటాళ్ల వరకు దిగుబడి అధికంగా వస్తుంది. మార్కెట్‌లో పత్తి క్వింటా సగటున రూ.7వేల వరకు ధర పలుకుతోంది. ఖర్చును మినహాయిస్తే ఎకరాకు రూ.22 వేలు నికరాదాయం లభించే అవకాశం ఉంది.


నూతన విధానంలో సాగు చేసిన పొలంలో వచ్చిన మొలకలు

మళ్లీ శనగ సాగు చేయవచ్చు



నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో కల్లూరు, సి.బెళగల్ మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నాం. స్వల్పకాలిక ప్రైవేటు హైబ్రిడ్ రకాలతో విత్తనం నాటడం పూర్తి అయింది. మొలకలు కూడా వచ్చాయి. మామూలు పద్ధతిలో పత్తి పంట కాలం 160-170 రోజులు ఉంటుంది. నూతన పద్ధతిలో 120-130 రోజులకు వస్తుంది. పత్తి పంట పూర్తి అయిన తర్వాత మళ్లీ శనగ సాగు చేసుకోవచ్చు.

– కళ్యాణి, పత్తి శాస్త్రవేత్త, ఆర్ఏఆర్ఎస్, నంద్యాల

నవంబరులో పంట పూర్తి

పత్తిని జనవరి, ఫిబ్రవరి వరకు ఉంచుతున్నారు. మంచి సారవంతమైన నల్ల రేగడి నేలల్లో రైతులు కేవలం ఒక్కపంటకే పరిమితం అవుతున్నారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు నవంబరు లోపు పూర్తవుతుంది. పత్తిలో దీర్ఘకాలిక పంట అయినందున డిసెంబరులో గులాబీరంగు పురుగు తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగు ప్రభావం వల్ల పత్తిలో నాణ్యత కూడ దెబ్బతింటోంది. దీనిని నివారించేందుకే అధిక సాంద్రత పద్ధతివైపు పరిశోధన సంస్థలు దృష్టి సారించాయి. నవంబరు లోపు పంట పూర్తి అయితే వెంటనే రబీ పంటలు సాగుకు అవకాశం ఉంది.

అవ్వ అవతారమెత్తి క్షుద్రపూజలు!

- ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మెదేహాల్ గ్రామస్తులు


మెదేహాల్ గ్రామస్తుల సమస్యను వింటున్న ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు

హాలహర్వి: అవ్వగా అవతారమెత్తిన అంజలి ఉరఫ్ అంజమ్మ క్షుద్రపూజలు చేస్తూ గ్రామ ప్రజలందరినీ భయభ్రాంతులకు గురి చేస్తోందని మెదేహాల్ గ్రామానికి చెందిన ప్రజలు సోమవారం హాలహర్వి తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంజలిపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు హాలహర్వి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని గ్రామస్తుల సమస్యను విన్నారు. ఈ సందర్భంగా మెదేహాల్ గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో మాల తిమ్మప్ప పెద్ద కుమార్తె అంజలి కొంతకాలంగా అవ్వ అవతారమెత్తి క్షుద్రపూజలు చేయడం, నిమ్మకాలు మంత్రించి వేయడం లాంటివి చేస్తోందన్నారు. ఇంటి పక్కన ఉన్న 8 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకుని, అందరినీ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. స్థలం చుట్టూ ఉన్న ప్రజలతో గొడవకు దిగుతూ అల్లర్లు సృష్టిస్తోందన్నారు. ఆమె హింసను భరించలేని తామంతా ఏకమై పోలీస్‌స్టేషన్‌కు చేరి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేస్తామని, ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా చూస్తామని చెప్పారు.

స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం: తహసీల్దార్

సర్వేనం.109లోని 8 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకుని అంజలి అందరినీ భయభ్రాంతులకు గురి చేస్తుందని మెదేహాల్ గ్రామస్తులు తహసీల్దార్ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. వెంటనే తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందిని గ్రామానికి పంపించి సర్వే చేయించారు. అక్కడ ఉన్న స్థలం గ్రామకంఠంకు చెందినదని, స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు.

ఈరన్న స్వామికి బంగారు జనివర బహూకరణ


దాతలకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామికి సోమవారం ఓ భక్తుడు 26.5 గ్రాముల బంగారు జనివర బహూకరించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆదోనికి చెందిన పి.మహదేవమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడు కోసిగయ్య జనివరాన్ని అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో దాతతో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, శేష వస్త్రాలను, లడ్డూలను, బాండును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్‌కుమార్, రామలింగారెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డీసీసీబీని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపుదాం

- డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. సోమవారం డీసీసీబీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని సేల్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. రైతులకు రుణాలు ఇచ్చి ఆర్థిక తోడ్పాటు ఇవ్వాల్సిన అవసరం ఎంతుందో, రికవరి చేయాల్సిన బాధ్యత కూడా అదే స్థాయిలో ఉంటుందన్నారు. రికవరీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మొండి బకాయిలను కూడా రాబట్టి బ్యాంకును మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిరర్థక ఆస్తులను తగ్గించడంపై దృష్టి సారించాలన్నారు. 2023-24 సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకునేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ముఖ్య కార్య నిర్వహణాధికారి పి.రామంజనేయులు, డీఆర్ ఓఎస్‌డీ నాగలింగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువు ఆగస్టు 19వ తేదీ వరకు పొడిగించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వైద్యకళాశాలలో రూ.100 రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 1వ తేదీన జరగాల్సిన మొదటి విడత కౌన్సెలింగ్ 26న నిర్వహిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తులు www.appmb.co. in/apsahpc.co.in వెబ్‌సైట్‌లో లభిస్తాయని తెలిపారు.

ఎద్దు పొడిచి వ్యక్తి మృతి


మృతి చెందిన హనుమంతు

సంజామల: ముక్కమల్ల గ్రామంలో ఎద్దు పొడిచి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కుమ్మరి చిన్న హనుమంతు (55) ఈనెల 27వ తేదీ సాయంత్రం ఇంటి వద్ద ఓ ఎద్దు పొడవడంతో తీవ్ర గాయమైంది. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 30వ తేదీ రాత్రి మృతి చెందాడు. మృతినికి భార్య నాగమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఓపెన్ స్కూళ్లపై అవగాహన కల్పించాలి


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): చదువు మధ్యలో నిలిపేసిన వారు ఓపెన్ స్కూళ్లలో చేరేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. 2023-24 ఏడాదికి సంబంధించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రాపౌట్స్ విద్యార్థులు పది, ఇంటర్‌ను పూర్తి చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆగస్టు 31వ తేదీ వరకు అడ్మిషన్లు పొందేందుకు గడువు ఉందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.2 కోట్లతో ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణం

- విలేకరుల సమావేశంలో సినీ నిర్మాత రాజ్‌కుమార్ సేతుపతి


హోమంలో పాల్గొన్న సినీ నిర్మాత రాజ్‌కుమార్, దేవస్థానం చైర్మన్

కర్నూలు (న్యూటౌన్): దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సహకారంతో రూ.2 కోట్లతో వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నామని సినీ నిర్మాత రాజ్‌కుమార్ సేతుపతి తెలిపారు. సోమవారం దేవస్థానంలో హోమాలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌తో వెయ్యేళ్లు పదిలంగా ఉండేలా ఎల్లమ్మ దేవాలయాన్ని పునర్నిర్మాణం చేస్తామని చెప్పారు. మంచి రోజు చూసుకుని అందరి సహకారంతో ఆలయ పునర్నిర్మాణం మొదలు పెడతామన్నారు. తమ తల్లిదండ్రులు షణ్ముఖరాజేశ్వర సేతుపతి, నీలారాణి ఇంటి దైవం సుంకులమ్మ, ఎల్లమ్మ తల్లి అని వెల్లడించారు. తన 25 ఏళ్ల వయసులో ఎల్లమ్మతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. 2024 డిసెంబర్ నాటికి ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత రాజ్‌కుమార్ సేతుపతి కుటుంబ సభ్యులు వెంకటేష్, సాయికృష్ణ, దేవస్థానం చైర్మన్ బేతం కృష్ణుడు, దేవదాయ ధర్మదాయ శాఖ డీఈ శ్రీనివాసులు, ప్రసాద్, ఈఓ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులపై విజి‘లెన్స్’


కర్నూలులోని పెట్రోల్ బంక్‌లో పంప్ నిర్వహణ తీరును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారి నీలం పూజిత ఆదేశాల మేరకు అధికారులు బృందాలుగా ఏర్పడి సోమవారం కర్నూలు, నంద్యాల పట్టణాల్లోని పెట్రోల్ బంకుల్లో రికార్డులను పరిశీలించారు. కర్నూలు శివారులోని గుత్తి రోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బంకు, వెంకటరమణ కాలనీలోని వెంకటేశ్వర ఫ్యూయల్ స్టేషన్‌లో విజిలెన్స్ సీఐ సునిల్‌కుమార్ నేతృత్వంలో తూనికలు, కొలతల శాఖల అధికారులు కలిసి తనిఖీలు నిర్వహించారు. కొలతల్లో ప్రమాణాలను, నాణ్యతను పరిశీలించారు. బిల్లు ఇస్తున్నారో లేదో ఆరా తీశారు. అగ్నిమాపక శాఖకు సంబంధించిన ఆథరైజేషన్ సర్టిఫికెట్ పొందారా.. భద్రతా జాగ్రత్తలతో పాటు లైసెన్స్ గడువు ఎంత కాలం ఉంది..తదితర వివరాలను పరిశీలించారు. పెట్రోల్ పంపుల నుంచి డీజిల్, పెట్రోల్ తీసి ఫిల్టర్ టెస్ట్ పేపర్‌పై చల్లి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. బంకులు ఓపెన్ ప్లేస్‌లో నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. నంద్యాల పట్టణంలో సీఐ నాగరాజు ఆధ్వర్యంలో శంకర్‌యాదవ్ ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు.

విద్యుత్ శాఖకు రూ.44 లక్షల నష్టం

కర్నూలు(రాజ్‌విహార్): ఇటీవల కురిసిన వర్షాలతో విద్యుత్ శాఖకు రూ.44.22 లక్షల నష్టం వాటిల్లింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 11 కేవీ స్తంభాలు 68, ఎల్‌టీ స్తంభాలు 69, 33 కేవీ స్తంభం ఒకటి విరిగి పడ్డాయి. నంద్యాల డివిజన్‌లో ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా 8.28 కిలో మీటర్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో సంస్థకు రూ.44.22 లక్షల నష్టం వాటిల్లినట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి తెలిపారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్ర స్వామి శ్రీమఠం జూలై నెల హుండీ ఆదాయం రూ.3,76,67,469 సమకూరినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు స్వామి వారికి నాణేల రూపంలో రూ.7.05 లక్షలు, కరెన్సీ రూపంలో రూ.3,69,62,469, బంగారు రూపంలో 99 గ్రాములు, వెండి 1940 గ్రాములు, స్వామి వారికి కానుకలు ముడుపులు రూపంలో చెల్లించినట్లు ఆయన వివరించారు.

తగ్గుతున్న వరద ప్రవాహం

- శ్రీశైలానికి 41,693 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జిల్లాలోకి ప్రవేశించిన ఎల్లెల్సీ నీరు


పోతిరెడ్డిపాడు అప్రోచ్‌కాల్వ నిండుగా చేరిన కృష్ణాజలాలు

శ్రీశైలం ప్రాజెక్ట్/హొళగుంద/హాలహర్వి/జూపాడుబంగ్లా: సాగునీటి ప్రాజెక్టులకు వరద ప్రవాహం తగ్గుతూ వస్తోంది. సోమవారం మధ్యాహ్నం వరకు జూరాల ప్రాజెక్ట్ స్పిల్‌వే ద్వార నీటిని విడుదల చేసి దిగువకు పంపారు. సాయంత్రం నుంచి జూరాల ప్రాజెక్ట్ గేట్లను మూసివేయడంతో శ్రీశైలానికి నీటి విడుదల తగ్గింది. సుంకేసుల నుంచి కూడా వచ్చే ప్రవాహం నిలిచిపోయింది. జూరాలలో విద్యుత్ ఉత్పాదన అనంతరం 41,693 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. ఆదివారం నుంచి సోమవారం వరకు జలాశయంలోకి 6.4027 టీఎంసీల నీరు వచ్చి చేరడంతో నీటిమట్టం 3.10 అడుగులకు పెరిగింది. ప్రస్తుతం జలాశయంలో 79.6340 టీఎంసీల నీరు నిల్వఉంది. డ్యాం నీటిమట్టం 849.80 అడుగులకు చేరుకుంది. టీబీ డ్యాంలో 80 టీఎంసీల నీరు కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లోని తుంగభద్ర రిజర్వాయర్‌కు వరద ఉధృతి సోమవారం మరింత తగ్గుముఖం పట్టింది. సోమవారం సాయంత్రం సమయానికి 38,864 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాం నుంచి రాయబసవన్న, పవర్‌కెనాల్(ఎల్లెల్సీ), హెచ్ఎల్‌సీకి 2,057 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా తుంగభద్ర డ్యాం నుంచి ఈ నెల 28న దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు విడుదల చేసిన నీరు సోమవారం ఉదయం కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. హాలహర్వి మండలం చింతకుంట గ్రామం వద్ద తుంగభద్ర దిగువ కాలువలో సోమవారం ఎస్డీఓ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హొళగుంద మండలంలో తుంగభద్ర రైతు సంఘం నాయకులు పురుషోత్తం గౌడ్ ఆధ్వర్యంలో వాయినం సమర్పించారు.


హాలహర్వి మండలం చింతకుంట వద్ద ఎల్లెల్సీలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మరో రెండు రోజుల్లో నీటి విడుదల?

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి మరో రెండు రోజుల్లో నీరు విడుదల చేయనున్నారు. శ్రీశైలం జలాశయంలో 854 అడుగుల నీటిమట్టం ఉంటే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేసుకోవచ్చు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలోకి 41,693 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. మంగళవారం సాయంత్రం నాటికల్లా డ్యాం 854 అడుగుల నీటిమట్టానికి చేరుకుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. బుధ, గురువారాల్లో పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని విడుదల చేసుకోవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు.

వక్ఫ్‌బోర్డు ఆదోని ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా అల్తాఫ్ హుసేన్

కర్నూలు(రాజ్‌విహార్): వక్ఫ్‌బోర్డు ఆదోని డివిజన్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా అల్తాఫ్ హుసేన్ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎండీ అజీమ్ సోమవారంతో పదవీ విరమణ పొందారు. దీంతో కర్నూలు ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అల్తాఫ్ హుసేన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర బోర్డు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మట్టి మిద్దె కూలి మహిళకు గాయాలు


చికిత్స పొందుతున్న ఈరమ్మ

నందవరం: మట్టి మిద్దె కూలి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో చోటు చేసుకుంది. ఉదయం తన ఇంటిలో బోయ హనుమన్న భార్య ఈరమ్మ వంట చేస్తుండగా.. భారీ వానలకు తడిసిన మట్టి మిద్దె ఒక్కసారిగా కూలింది. దీంతో మంటలు ఎగిసి పడి ఆమెకు కాలిన గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి 108 అంబులెన్స్‌లో కర్నూలులోనికి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.